

టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జేసీ చేతన్ సూచించారు. ఓటరు అవగాహన ర్యాలీని ప్రారంభించారు. 8లో

గరిష్టం/కనిష్టం
31.3°/17.1°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. అల్పపీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది. ఉదయం చలి కొనసాగింది. వాయువ్య దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

92 శాతం పింఛన్ల పంపిణీ



కొట్లపల్లిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక'లో భాగంగా శనివారం నాటికి 92 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,72,262 మందికి రూ.75,67,09,250 మంజూరైంది. రెండు రోజుల్లోనే 2,49,603 మందికి రూ. 69,35,22,000 నగదు మొత్తాన్ని వలంటీర్లు అందించినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మరో మూడు రోజులు పంపిణీ ఉంటుందని తెలిపారు.

అభాగ్యులకు సేవే లక్ష్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న రత్నాకర్ రాజు, నిమిష్ పాండ్య

ప్రశాంతి నిలయం: ప్రపంచ నలుమూలలా ఉన్న అభాగ్యులకు సత్యసాయి సేవలను విస్తరించడమే ప్రతి భక్తుడి లక్ష్యం కావాలని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య పిలుపునిచ్చారు. నేపాల్ సత్యసాయి సేవా సంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకలు రెండో రోజు శనివారం ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. విద్యార్థులకు రామాయణం, సత్యసాయి, మహాభారతంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నేపాల్‌లోని సత్యసాయి బాల సేవా ఆశ్రమం, సత్యసాయి వృద్ధాశ్రమ చిన్నారులు, సిబ్బంది సంగీత కచేరీ నిర్వహించారు. నేపాల్ ఇంటిగ్రేటెడ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు రత్నాకర్, నిమిష్ పాండ్య సర్టిఫికెట్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తులో సత్యసాయి సేవలను మరింత విస్తరిస్తామన్నారు. ప్రతి భక్తుడు ఆయన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

8 నుంచి పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు



మరమ్మతులు చేయనున్న సొరంగ మార్గం

పుట్టపర్తి టౌన్: ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్– కొత్తచెరువు మార్గంలోని నల్లకొండ వద్ద 234 మీటర్ల పొడవైన రైల్వే సొరంగంలో మరమ్మతుల కారణంగా ఈ నెల 8 నుంచి ఫిబ్రవరి 8 వరకూ పలు రైళ్ల రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ మేనేజర్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చెన్నై–షిరిడీ, బెంగుళూరు–పుట్టపర్తి, బెంగుళూరు– ధర్మవరం, కొండవీడు, గరీబ్‌రథ్, కర్ణాటక, రాజధాని, ఉద్యాన్, ప్రశాంతి, బసవ తదితర ప్రధాన సర్వీసులు రద్దు కానుండగా, హౌర, కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లు ధర్మవరం రైల్వేస్టేషన్ వరకే నడుస్తాయి. చెన్నై ఎక్స్‌ప్రెస్ (ప్రతి శనివారం) బెంగళూరు వరకూ మాత్రమే వెళ్తుంది. ఫిబ్రవరి 9 నుంచి సర్వీసులు పునఃప్రారంభమవుతాయన్నారు. కాగా, ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ధర్మవరం రైల్వేస్టేషన్–పుట్టపర్తి బస్సు సర్వీసులు పెంచుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం

- వైఎస్సార్ సీపీ బస్సు యాత్రలకు ప్రజల బ్రహ్మారథం
- ప్రజాధనం లూటీ చేయబట్టే జైలుకు చంద్రబాబు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రాప్తాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర జరిగే స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



మడకశిరలో ప్రజాప్రతినిధులు, నాయకులతో చర్చిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

రాప్తాడు: జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం జరుగుతోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ నెల 4న రాప్తాడులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసే బహిరంగ సభ స్థలాన్ని వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకూ సామాజిక, ఆర్థిక న్యాయం చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించే బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ తీసుకోవాలన్నారు. చంద్రబాబు ప్రజాధనం లూటీ చేశారు కాబట్టే జైలు జీవితం అనుభవించారన్నారు. తప్పు చేసిన వ్యక్తి ఎంతటి వారైనా శిక్ష తప్పదన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాలకు అధికారం అందాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. అందువల్లే 25 మంది ఉన్న మంత్రి వర్గంలో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చోటు కల్పించారన్నారు. ఎస్సీ మహిళను రాష్ట్ర హోం మంత్రిగా చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకర నారాయణ, సిద్దారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ బోర్డు సభ్యుడు ఆగ్రోస్ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట

మడకశిర: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం రాత్రి ఆయన మడకశిరకు వచ్చారు. వాల్మీకి సర్కిల్‌లో మంత్రికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఈ నెల 7న మడకశిరలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రపై మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవుల పంపకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం జగన్ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సామాజిక సాధికార బస్సు యాత్రలకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లో యాత్రలు విజయవంతంగా సాగుతున్నాయనిచెప్పారు. మడకశిరలో జరిగే బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని, ఆ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా చూశారని దుయ్యబట్టారు. సమావేశంలో ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకర నారాయణ, కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మాజీ ఎమ్మెల్యేలు వైటీ ప్రభాకర్‌రెడ్డి, నర్సేగౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, జీబీ శివకుమార్, రంగేగౌడ్, జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, స్వారక్క, సరోజమ్మ, ఎంపీపీలు రాధమ్మ, కవిత, ఈరన్న, రొళ్ల కవిత, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మండల కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జి ఆలయాల సందర్శన



దుర్గమ్మ ఆలయంలో జిల్లా జడ్జి శ్రీనివాస్

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని పలు ఆలయాలను శనివారం ఉమ్మడి జిల్లా జడ్జి శ్రీనివాస్ సందర్శించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువలతో సత్కరించారు. జిల్లా జడ్జి వెంట సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యశ్రీలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కోర్టును శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. జడ్జిలతో మాట్లాడారు. అనంతరం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి అధ్యక్షతన బార్ అసోసియేషన్ సమావేశ భవనంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. గతంలో జడ్జిగా కృష్ణవేణి ఉన్న సమయంలో 33 కేసులకు సంబంధించిన పత్రాలను జిల్లా కోర్టు వారు తీసుకెళ్లారన్నారు. తిరిగి తీసుకురాకపోవడంతో కక్షిదారులతో పాటు తాము కూడా చాలా ఇబ్బందిగా పడుతున్నామని న్యాయవాదులు తెలిపారు. ఆ పత్రాలను ధర్మవరం కోర్టుకు పంపించేందుకు కృషి చేస్తానని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 9న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. టీ బంకు, జిరాక్స్ సెంటర్లను వారంలోపు వేరే చోటికి మార్చాలని ఆదేశించారు.

ప్రతి పేదవాడికీ భూ పంపిణీ

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: ప్రతి పేదవాడికీ భూమిని పంపిణీ చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో 8వ విడత భూ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 325 ఎకరాలకు సంబంధించిన పట్టాలను 225 మందికి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిగిచెర్లకు చెందిన 186 మంది, వసంతపురం గ్రామానికి చెందిన 36 మందికి భూ పంపిణీ చేశామన్నారు. 225 మందిలో 135 మంది ఎస్సీలు, ముగ్గురు ఓసీలు కాగా, మిగిలిన వారంతా బీసీలు, మైనార్టీలేనని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో సొసైటీని రద్దు చేసి భూములను స్వాధీనం చేసుకునేందుకు కొంత మంది యత్నిస్తే, చిగిచెర్ల గ్రామానికి చెందిన దివంగత నేత శివారెడ్డితో పాటు రామక్రిష్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుని భూములు పేదలకు దక్కేలా కృషి చేశారన్నారు. ప్రస్తుతం చిగిచెర్ల ప్రాంతంలో ఎకరం రూ.కోటి పైగా పలుకుతోందని, ఇలాంటి సమయంలో భూములను పంచడం ఎంతో సంతోషకరమన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 40 వేల ఎకరాలు పేదలకు అందించామన్నారు. రేగాటిపల్లి పంచాయతీలో సొసైటీ భూముల విషయమై గతంలో 18 మంది దాకా హత్యకు గురయ్యారని, కోర్టుల్లో ఉన్న అలాంటి భూములను సైతం పరిష్కరించి అర్హత ఉన్న రైతులకు పంపిణీ చేశామన్నారు. ఇళ్ల పట్టాల కోసం అదే రేగాటిపల్లి రైతుల నుంచి ఎకరం రూ.25 లక్షలతో ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని, అందులో భాగంగా రీ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. వంద సంవత్సరాల తర్వాత భూముల సర్వే చేపడుతున్నట్లు గుర్తు చేశారు.

గరుడంపల్లి వద్ద వేరుశనగ చిక్కీ ఫ్యాక్టరీ..

ధర్మవరం మండలంలోని గరుడంపల్లి సమీపంలో 11 ఎకరాల్లో రూ.70 కోట్లతో త్వరలో వేరుశనగ చిక్కీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి తెలిపారు. దీంతో దళారుల బెడద తప్పి వేరుశనగ రైతులకు లాభాలు చేకూరతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాబయ్య, నాగానందరెడ్డి, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఓబిరెడ్డి, వైస్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మినారాయణ, నాయకులు రమణారెడ్డి, రామయ్య, విశ్వనాథ్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'నలంద' విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్ భవనంపై నుంచి దూకిన విద్యార్థిని
- ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఎస్పీ ఆదేశం



సుధ (ఫైల్), నలంద కాలేజీ హాస్టల్ భవనం

అనంతపురం క్రైం: నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న పాటిల్ సుధ (18) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కాలేజీ హాస్టల్ భవనంపై నుంచి దూకి మృతిచెందింది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బొమ్మనహాళ్ మండలం కల్లుహోళ గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్, రత్నమ్మ దంపతుల కుమార్తె సుధ నగరంలోని నలంద కళాశాలలో ఇంటర్ (సీఈసీ గ్రూపు) రెండో సంవత్సరం చదువుతోంది. సమీపంలోని మేడా నర్సింగ్ హోం వద్ద ఉన్న అదే కళాశాల హాస్టల్లో ఉంటోంది. గౌరమ్మ పండుగ కోసం ఇటీవల ఊరెళ్లిన సుధ శుక్రవారం తిరిగొచ్చింది. మధ్యాహ్నం 2.40 గంటలకు హాస్టల్‌కు చేరుకుంది. తండ్రికి ఫోన్ చేసి తాను చేరుకున్న విషయం చెప్పింది. అనంతరం కళాశాలకు వెళ్లి సాయంత్రం 5.52 గంటలకు మిత్రులతో కలసి హాస్టల్‌కు తిరిగొచ్చింది. నాల్గవ అంతస్తులోని రూమ్ నంబర్–7లో తనతో పాటు మరో ఐదుగురు విద్యార్థినులు ఉంటున్నారు. వారితో కొంతసేపు మాట్లాడిన తర్వాత కన్నీళ్లు పెట్టుకుంటూ గదిలోంచి బయటకు వచ్చింది. గది తలుపులకు బయట గడియ పెట్టింది. కారిడార్ వాష్ బేషిన్ వైపు వెళ్లింది. అక్కడ లాక్ చేసి ఉన్న గ్రిల్‌డోర్ పైకి ఎక్కి కారిడార్ వైపు కిందకు దిగింది. నాల్గవ అంతస్తు నుంచి సరిగ్గా 6.44 గంటలకు కిందకు దూకింది. బయట నుంచి పెద్ద శబ్దం రావడంతో గది లోపలున్న విద్యార్థినులు గట్టిగా తలుపులు తట్టారు. ఆ శబ్దానికి వార్డెన్ వచ్చి తలుపులు తీసి ఎందుకిలా చేస్తున్నారంటూ ఆరా తీశారు. సుధ కిందకు పడిపోయిన శబ్దం వచ్చిందని చెప్పారు. దీంతో కిందకు చూడగా హాస్టల్ పక్క కాంపౌండులోని సిమెంటు ప్లాట్‌ఫాంపై పడి ఉంది. ఆమెను వెంటనే పక్కనే ఉన్న ప్రైవేటు నర్సింగ్ హోమ్‌కు..అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ప్రారంభించిన గంట వ్యవధిలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గోప్యంగా ఉంచిన కాలేజీ యాజమాన్యం

ఘటన శుక్రవారం సాయంత్రం 6.44 గంటలకు జరగ్గా.. కాలేజీ యాజమాన్యం మాత్రం రాత్రి 9 గంటలకు పోలీసులకు సమాచారం ఇచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు స్వగ్రామం నుంచి అర్ధరాత్రి అనంతపురానికి చేరుకున్నారు. ఆ తర్వాతే విషయం బయటకు తెలిసింది. విద్యార్థి సంఘాల నేతలు శనివారం కాలేజీ హాస్టల్ ముందు ఆందోళన చేపట్టారు.

కుమార్తె మృతిపై అనుమానాలున్నాయి..

కళాశాల యాజమాన్యం వైఖరితోనే తమ బిడ్డ చనిపోయిందని, మృతిపై అనుమానాలు ఉన్నాయని సుధ తల్లిదండ్రులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంటిపై ఎక్కడా రక్తగాయాలు లేకపోయినా గొంతు కింది భాగంలో మాత్రం గాట్లు ఉన్నట్లు తెలిపారు. నాలుగు అంతస్తుల భవనంపై నుంచి కిందకు పడితే శరీరం ఛిద్రమవుతుందని, కానీ కనీసం కాలు, చెయ్యి కూడా చెక్కు చెదరలేదని, తమ బిడ్డను హత్య చేసి కిందకు నెట్టి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. విద్యార్థిని మృతి ఘటనను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సీరియస్‌గా పరిగణించారు. మృతికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. దిశ డీఎస్పీ ఆంథోనప్పను దర్యాప్తు అధికారిగా నియమించారు.

లోతుగా దర్యాప్తు చేస్తాం

విద్యార్థిని సుధ మృతికి దారి తీసిన కారణాలపై లోతుగా దర్యాప్తు చేస్తామని దిశ డీఎస్పీ ఆంథోనప్ప తెలిపారు. ఆయన శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నగర డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ రెడ్డప్పతో కలసి విలేకరులతో మాట్లాడారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి మరణానికి దారితీసిన కారణాలు వెల్లడిస్తామన్నారు.

ప్రజలదే రాజ్యాధికారం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి
- 4న రాప్తాడులో సామాజిక సాధికార సభ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలదే రాజ్యాధికారమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రాప్తాడులో ఈ నెల 4న నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం రాప్తాడుకు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసంగిస్తారన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వివిధ సంక్షేమ పథకాలతో రాప్తాడు నియోజకవర్గంలో రూ.2,500 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఎక్కువ శాతం ఉన్నారన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారన్నారు.

మాయమాటలు చెప్తారు జాగ్రత్త!

తెలుగుదేశం మాజీ మంత్రి పరిటాల సునీత నాలుగేళ్లు నిద్రావస్థలో ఉండి.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మెలకువలోకి వచ్చారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఓట్ల కోసం మాయమాటలు చెబుతారని,మోసపోకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టీడీపీ హయాంలో ఫ్యాక్షన్, రౌడీయిజం, దౌర్జన్యం పేట్రేగిపోయాయని, నియోజకవర్గ అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ప్రజాధనాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. అటువంటి వారు ఇప్పుడు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. తాను కమీషన్లకు గాని, రక్తపు మరకలతో సంపాదించే సొమ్ముకు కానీ ఏనాడూ ఆశపడబోనని తేల్చి చెప్పారు. తన చివరి రక్తపు బొట్టు వరకు పరిటాల కుటుంబంతో రాజీ పడేదే లేదన్నారు. పరిటాల సునీత మంత్రిగా ఉన్నసమయంలో పేరూరు డ్యాంకు నీరు తెస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తాను పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తుంటే కర్ణాటక రాష్ట్రం పావగడ ఎమ్మెల్యే ద్వారా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో 50 వేల ఓట్లు తొలగించేందుకు పరిటాల సునీత కుట్ర పన్నిందని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఆమె మంత్రిగా ఉన్నపుడు జరిగిన ఓటరు నమోదును ఈ రోజు తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తాజాగా తమకు అనుకూలమైన బీఎల్‌ఓల ద్వారా 15, 16, 17 సంవత్సరాల పిల్లలను ఓటర్లుగా చేర్పించేందుకు సునీత ప్రయత్నిస్తున్నారన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ధనుంజయయాదవ్, గుజ్జల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది బదిలీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలో 17 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 24 మంది కానిస్టేబుళ్లను వివిధ పోలీసుస్టేషన్లకు బదిలీ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, 14 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించారు.

క్లుప్తంగా

రోటావేటర్ కింద పడి యువకుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు రోటావేటర్ కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం అడదాకుల పల్లికి చెందిన ఆంజనేయులు (37)కు భార్య కావేరి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం సొంతూరుకే చెందిన ఓ రైతు పొలంలో రోటావేటర్ సాయంతో భూమిని చదును చేసే పనుల్లో నిమగ్నమయ్యాడు. కుదుపులకు అదుపుతప్పి ట్రాక్టర్‌పై నుంచి కిందపడిన ఆంజనేయులు నేరుగా రోటావేటర్‌లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని గమనించిన గొర్రెల కాపరులు వెంటనే సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

అంతర్జాతీయ రోప్ జంప్ పోటీలకు నల్లమాడ విద్యార్థి


తాహీర్

నల్లమాడ: త్వరలో జరిగే అంతర్జాతీయ రోప్ జంప్ పోటీలకు నల్లమాడకు చెందిన ఓ విద్యార్థి ఎంపికయ్యాడు. వివరాలను విద్యార్థి చదువుతున్న పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరస్పాండెంట్ స్వర్ణలత శనివారం వెల్లడించారు. తమ పాఠశాల విద్యార్థి ఎస్. తాహీర్ నవంబర్ 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు మహారాష్ట్రలోని శిరిడీలో జరిగిన జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. అంతేకాక విద్యార్థులు సి.బద్రీనాథ్, జయసూర్య కాంస్య పతకాలతో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

ధర్మవరం రూరల్: మండలంలోని సీతారాంపల్లి వద్ద శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. మృతుడిని కనగానపల్లి మండలం చంద్రశ్చర్ల గ్రామానికి చెందిన నరసింహులు (75)గా పోలీసులు గుర్తించారు. శనివారం అనంతపురానికి వెళ్లేందుకు సిద్ధమైన ఆయన ఆటో కోసం జాతీయ రహదారిపై సీతారాంపల్లి క్రాస్ వద్ద వేచి ఉండగా వాహనం ఢీకొంది. మృతుడికి భార్య నరసమ్మ, ఒక కుమారుడు, ఐదుగురు కుమార్తెలున్నారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సకలాంగులతో సమానంగా..

జగన్ సర్కార్ ప్రోత్సాహంతో అన్నింటా రాణిస్తున్న దివ్యాంగులు

- ఏడాదికి ఏడు ప్రత్యేక సెలవులు
- ఇంటి వద్దకే పింఛన్ పంపిణీతో ఊరట
- 'స్పందన'లో దివ్యాంగుల చెంతకే అధికారులు
- రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలపై విభిన్న ప్రతిభావంతుల హర్షం

సాక్షి, పుట్టపర్తి

సమాజంలో ఉన్నతమైన గౌరవం.. గుర్తింపుతో పాటు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు సకాలంలో చెంతకు చేరుతుండడంతో సకలాంగులతో సమానంగా దివ్యాంగులూ రాణిస్తున్నారు. దివ్యాంగులైన ఉద్యోగులకు ఏడాదికి ఏడు అదనపు సెలవులు..... అన్ని అర్హతులున్న విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దకే పింఛన్ అందజేత. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో దివ్యాంగుల చెంతకే కలెక్టర్, ఎస్పీ తదితర ఉన్నతాధికారులు చేరుకుని దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం తదితర సంస్కరణలు అమలు చేసిన జగన్ సర్కార్‌పై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సీఎం వైఎస్ జగన్ పాలనలో తమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయిందని దివ్యాంగులు సగర్వంగా చెబుతున్నారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలుపై చైతన్య పరుస్తూ ఏటా డిసెంబర్ 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై దివ్యాంగులు ఏమంటున్నారో వారి మాటల్లోనే...


సందర్భం: నేడు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినం

అదనపు సెలవులతో ఊరట



ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న దివ్యాంగుల సంక్షేమాన్ని గురించి గత పాలకులు ఎవరూ పట్టించుకోలేదు. సకలాంగులతో సమానంగా కదల్లేని మేము ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకోవాలనే ఆత్రుతలో పిల్లల చదువులు, ఇతర అవసరాలు తీర్చలేక ఇబ్బందులు పడ్డాం. మా కష్టాలు.. ఇబ్బందులపై ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. ఉద్యోగులుగా ఉన్న విభిన్న ప్రతిభావంతులకు ఏడాదిలో అదనంగా ఏడు సెలవులు కేటాయించారు. దీంతో వైద్య చికిత్సలు పొందడం, వ్యక్తిగత, కుటుంబ అవసరాలు తీర్చుకునేందుకు తీరిక దొరికినట్టైంది. అదనపు సెలవులతో ఊరట దక్కింది. పనులన్నీ చక్కబెట్టుకోగలుగుతున్నాం.

– పి.రాజశేఖరరెడ్డి, ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు



సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతో విభిన్న ప్రతిభావంతులు సుదూరం వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. గ్రామాల్లోనే రెవెన్యూ, వ్యవసాయ, రిజిస్ట్రేషన్ పనులతో పాటు ఇంటి వద్దనే ఉంటూ ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందే వెసులుబాటూ కల్పించారు. ఇంటి వద్దకే డాక్టర్లు వస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారు.

– పీఎండీ షఫీ, అనంత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు

సచివాలయ వ్యవస్థ బాగుంది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయ వ్యవస్థను అమలు చేయడంతో నాకు ఉద్యోగ అవకాశం దక్కింది. ప్రస్తుతం కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. పోషణ సజావుగా సాగుతోంది. విధి నిర్వహణలో తోటి ఉద్యోగుల సహకారం మరువలేను.

– అంకె సుధీర్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, రావులచెరువు సచివాలయం

ఇంటి స్థలం ఇచ్చారు



అవిటితనంతో బాధపడుతున్న నేను ఎన్నో ఉద్యోగ ప్రయత్నాలు చేసి విఫలమయ్యాను. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్ బాధ్యతలు తీసుకున్న తర్వాత వలంటీర్‌గా పని చేసే అవకాశం దక్కింది. దివ్యాంగుల కోటాలో నాకో ఇంటి స్థలం కూడా ఇచ్చారు.

– షరీఫున్నీసా, వలంటీర్, అనంతపురం

గతంలో చాలా ఇబ్బంది పడ్డాం



గతంలో స్వయం ఉపాధి లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ మా జీవితాల్లో వెలుగులు నింపింది. ఎంతోమంది దివ్యాంగులు ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారు.

– రామాంజినేయులు, వార్డు ఎమినిటీ సెక్రటరీ, అనంతపురం కార్పొరేషన్

ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించాలి



శిక్షణకు హాజరైన రైతు సాధికార సంస్థ సభ్యులు, మాట్లాడుతున్న ఆవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించేలా చర్యలు తీసుకోవాలని రైతు సాధికార సిబ్బందికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, డీపీఎం లక్ష్మానాయక్ సూచించారు. ప్రకృతి వ్యవసాయం విస్తరణ అంశంపై పుట్టపర్తి మండలం బీడుపల్లి అభయాంజనేయస్వామి కల్యాణమంటపంలో రైతు సాధికార సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను శనివారం వారు ప్రారంభించి, మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో ప్రకృతి వ్యవసాయం కింద సాగులో ఉన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన దేశవిదేశీ శాస్త్రవేత్తల బృందం సంతృప్తి వ్యక్తం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలను ఆర్జించే ప్రకృతి వ్యవసాయంపై యావత్ రాష్ట్రం చూపు జిల్లాపై ఉందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతు సాధికార సంస్థ రాష్ట్ర సభ్యులు పున్నారావు, అశోక్ శిక్షణ ఇచ్చారు.

తుపాను నేపథ్యంలో పంటల సంరక్షణ తప్పనిసరి

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తుపాను ముప్పు పొంచి ఉండడంతో పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సూచించారు. పంటలు కోత దశలో ఉండటంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వరి గింజ గట్టిపడి ఉంటే వెంటనే హార్వెస్టర్ సాయంతో కోతలు ముగించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరి పంట కోసి కుప్పలు వేసి ఉంటే వర్షానికి తడవకుండా పాలిథిన్ కవర్లు, టార్పలిన్‌లు కప్పి ఉంచాలన్నారు. తడిసిన పనలలో మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. పత్తి, మిరప పొలాల్లో వర్షపు నీరు నిల్వకుండా సులువుగా వెళ్లిపోయేలా గండ్లు సిద్ధం చేయాలన్నారు. పత్తి పంటలో కాయలు విచ్చుకుని ఉంటే పత్తిని తీయాలని, మిరప చేను నుంచి కాయలను కోసి అధిక వర్షాలకు తడవకుండా కాపాడుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత విల్ట్ తెగులు సోకకుండా బ్లైటాక్స్/మ్యాన్‌కోజెబ్, పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలన్నారు. మొక్కల మొదళ్లలో యూరియా, పొటాష్ వేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1000 హెక్టార్లలో వరి పంట నూర్పిడి కావాల్సి ఉందని, రైతులు వెంటనే అప్రమత్తమై దిగుబడుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

వైభవంగా గుడ్డం రంగనాథస్వామి కల్యాణోత్సవం


ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

హిందూపురం: స్థానిక గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తుల ప్రాకారోత్సవం అనంతరం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ పర్యవేక్షించారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

పాము కాటుతో రైతు మృతి

బత్తలపల్లి: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. మండలంలోని రామాంజులపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. అడవి పందులు బెడద నుంచి వరి పంటను కాపాడుకునేందుకు రైతు చంద్రశేఖరనాయుడు (45) శనివారం సాయంత్రం పొలం చుట్టూ కంచె వేసుందుకు కట్టెలు పాతుతున్న సమయంలో పాము కాటేసింది. విషయాన్ని భార్య సౌభాగ్యకు తెలపడంతో వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మైనర్ పెళ్లిపై ఫిర్యాదు

హిందూపురం: స్థానిక కొటిపి రోడ్డులో నివాసముంటున్న బేల్దారి బాలు తనను బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని పోలీసులకు లక్ష్మీపురానికి చెందిన ఓ పదిహేడేళ్ల బాలిక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ రియాజ్ అహమ్మద్ శనివారం తెలిపారు. శుక్రవారం కొటిపిలోని చౌడేశ్వరీ ఆలయంలో పెళ్లి చేసుకున్నట్లుగా బాధితురాలు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తికి దేహశుద్ధి

నల్లచెరువు: మండలంలోని చిన్నయల్లంపల్లి సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉదయం ప్రవేశించి, పారిపోయిన ఓ గుర్తు తెలియని వ్యక్తిని గ్రామస్తులు వెంబడించి పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. విచారణలో ఆగంతకుడిని మహారాష్ట్రకు చెందిన బాలాజీగా గుర్తించినట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. అతని వద్ద ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబసభ్యులను సంప్రదిస్తే దొంగ కాదని, హైదరాబాద్‌లోని యర్రగడ్డ ఆస్పత్రిలో కొన్ని రోజులుగా చికిత్స పొంది సొంతూరుకు వెళ్లే క్రమంలో తప్పి పోయినట్లుగా తెలిపారన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



ధర్మవరం అర్బన్: స్థానిక కొత్తపేటలో శనివారం రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని మహిళ (50) మృతదేహాన్ని టూటౌన్ పోలీసులు గుర్తించారు అనారోగ్యంతో మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఆచూకీ తెలిసిన వారు 9440044904కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి

హిందూపురం టౌన్: ప్రజాస్వామ్యంలో ఆయుధం లాంటి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అన్నారు. శనివారం ఓటరు అవగాహన ర్యాలీని జేసీ చేతన్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా ఆర్టీసీ బస్టాండ్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటరు అవగాహన ర్యాలీలను శని, ఆదివారాల్లో జరుపుకుంటున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నూతన ఓటరుగా నమోదుకు ఫారం–6, మరణించిన వారి వివరాలను ఓటర్ జాబితా నుంచి తొలగింపునకు ఫారం–7, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు ఉంటే ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ లేదా ఎన్‌వీఎస్‌పీ వెబ్ సైట్ లేదా 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఓటరుగా ఎక్కడ నమోదయ్యారో తెలుసుకోవచ్చని తెలిపారు. ఓటరు క్యాంపెనింగ్ డేలలో ఆయా పోలింగ్ స్టేషన్లలో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 58, 59, 60, 63, 74, 75 పోలింగ్ స్టేషన్లలను పరిశీలించి బీఎల్ఓల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, ఎంఈఓ గంగప్ప, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవాక్కు

గతమంతా కష్టాలే



గత ప్రభుత్వ హయాంలో కష్టాలు.. ఇబ్బందులు తప్ప మరేమీ చూడలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పింఛన్ కష్టాలు తీరాయి. ప్రతి నెలా 1వ తారీఖునే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా ఇంటి వద్దనే తీసుకుంటున్నాం. ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగే బాధ తప్పింది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నేనూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాను. సీఎం వైఎస్ జగన్ పాలన చాలా బాగుంది. – చిన్నరంగడు పెద్దవడుగూరు

నాకు ఆయువు పోశారు



నాకు 62 ఏళ్లు. లారీ డ్రైవర్‌గా పనిచేసే నా భర్త వీరన్న 30 ఏళ్ల క్రితమే మరణించాడు. ముగ్గురు కుమారులు, ఓ కుమార్తెను అతి కష్టంపై పెంచి పెద్ద చేశా. కూలి పనులు చేస్తూ కష్టపడి దాచుకున్న డబ్బుతో పిల్లలందరికీ పెళ్లిళ్లు చేశా. ప్రస్తుతం నా చిన్న కొడుకు ఉరుకుంద ఇంట్లో ఉంటున్నా. నా కోడలు నైటీలు కుడుతుంటే వాటిని ప్యాకింగ్ చేస్తుంటాను. జీవితం బాగుపడుతోందనుకుంటున్న తరుణంలో గత ఏడాది జూలైలో గుండెనొప్పి వచ్చింది. వెంటనే నన్ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేసి, నాకు ఆయువు పోశారు. ఐదు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉన్నాం. ఒక్క పైసా కూడా మా చేతి నుంచి ఖర్చు కాలేదు. డిశ్చార్జ్ సమయంలో ఏడాదికి సరిపోయే మందులూ ఇచ్చారు. అతే కాక వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున మూడుసార్లు డబ్బులు పడ్డాయి. ప్రతి నెలా రూ.2,750 వితంతు పింఛన్ అందజేస్తున్నారు. మరో పది కాలాల పాటు సీఎంగా వైఎస్ జగనే ఉండాలని కోరుకుంటున్నా. – పి.లక్ష్మీదేవి, గుంతకల్లు

ఇబ్బందులు తొలిగాయి



రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. ఇంటర్ వరకూ చదువుకున్న నా కుమారుడు ఆంజనేయులుకు వలంటీర్‌గా పని చేసే అవకాశం దక్కింది. ఆసరా పథకంతో నాకు ఏటా రూ.10 వేల చొప్పున మూడు దఫాలుగా రూ.30 వేల సాయం అందింది. నా భర్త హనుమంతుకు కళాకారుల పింఛన్ అందుతోంది. చేయూత పథకంతో ఏటా రూ.18,750 ఇస్తున్నారు. కొడుక్కి పెళ్లి చేయడంతో కల్యాణమస్తు పథకం కింద కోడలు దివ్యకు రూ.లక్ష లబ్ధి చేకూరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి.

– హెచ్.రామాంజినమ్మ, రామనేపల్లి, బొమ్మగుప్ప మండలం

కంటి చూపు బాగుపడింది



కంటి చూపు సక్రమంగా లేక ఇబ్బంది పడేదాన్ని. డబ్బు సమస్య ఉండడంతో ఆస్పత్రికి వెళ్లలేక పోయాను. అయితే మా ఊళ్లోనే పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చూపించుకుంటే అనంతపురంలోని పెద్దాస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. అద్దాలిచ్చారు. ఇప్పుడు చూపు బాగుంది. ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి వైద్య చికిత్సలు చేసేలా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్ పాలన ఎంతో బాగుంది.

– లక్ష్మక్క, కమ్మూరు, కూడేరు మండలం

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

బత్తలపల్లి: అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి, వారి నుంచి పిడి బాకు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. బత్తలపల్లి స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇటీవల 31 గొర్రెలను అపహరించిన కేసులో ఇప్పటికే దాసరి లక్ష్మన్న, లోచర్ల బాలకృష్ణ, దాసరి రాముని పోలీసులు అరెస్ట్ చేసి, సొత్తును కూడా రికవరీ చేశారు. ఇదే కేసులో పరారీలో ఉన్న ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లికి చెందిన తండ్రీకొడుకులు ముష్టూరు గంగులప్ప, హరికృష్ణని శనివారం ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. గంగులప్పపై అనంతపురం, తనకల్లు, హిందూపురం, బత్తలపల్లి, ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయి. హరికృష్ణ సాయంతో గంగులప్ప చోరీలకు పాల్పడేవాడు. కాగా, గత 12 ఏళ్లుగా వివిధ కేసుల్లో గంగులప్ప పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు.

పలు రైళ్లు రద్దు

గుంతకల్లు: మిచాంగ్ తుపాను కారణంగా గుంతకల్లు డివిజన్ మీదుగా నడుస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. 3, 4, 5 తేదీల్లో తిరుపతి-లింగంపల్లి (12733), 4, 5, 6 తేదీల్లో లింగంపల్లి – తిరుపతి (12734), 3, 4 తేదీల్లో తిరుపతి-సికింద్రాబాద్ (12763), 5, 6 తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి (12764), 3, 4, 5 తేదీల్లో నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (17247), 4, 5, 6 తేదీల్లో ధర్మవరం–నర్సాపూర్ (17248) ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు వివరించారు. 5వ తేదీన తిరుపతి–అదిలాబాద్–తిరుపతి (17405/06) ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 3, 4, 5 తేదీల్లో విశాఖపట్నం–కడప (17488) రైళ్లు, 4, 5, 6 తేదీల్లో కడప–విశాఖపట్నం (17487) రైళ్లు, 3, 4 తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (20701/02) ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.